

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం

23 జూన్ 2025 పేజీలు : 08


## అడవి జంతువుల
# అరణ్య వే(రో)దన

భూమి మీద మానవాళితోపాటు అనేకరకాల జంతుజాలాలు సైతం స్వేచ్ఛగా జీవనం సాగిస్తున్నాయి. గతంలో భూమి మీద ఆవిర్భవించిన అనేక రకాల జంతు జాతులు ఈ ఆధునిక యుగంలో కనుమరుగై పోతుండటం వెనుక కాపాడు కోవాల్సిన అటవీ వన్యప్రాణి విభాగం అధికారులు బాధ్యతలు విస్మరించడం, అడవి జంతువులు మృత్యువాత పడిన సమాచారాన్ని తెలుసుకొని మొక్కుబడిగా సంఘటనా స్థలానికి వెళ్లడం, నిమిషాల వ్యవధిలోనే ఫార్మాలిటీస్ పూర్తి చేసుకొని వెళ్లడం వంటి వైఫల్యాలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కారణమవుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వైఫల్యాల నేపథ్యాల్లో అమాయక అడవి జంతుజాతులను అంతరించి పోకుండా కాపాడుకోవడం, మానవ మనుగడ వైపు ముందుకు వెళ్లడం అనివార్యంగా మారినట్లు తెలుస్తుంది.

- వెంటాడుతున్న వేటగాళ్ల అస్త్రాలు
- నిత్యకృత్యంగా మారిన మూగజీవాల వధ
- కొరవడిన పర్యవేక్షణ.. గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- నీరుగారుతున్న 1972 వన్యప్రాణి రక్షణ చట్టం



నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :

జిల్లా అటవీ టెరిటోరియల్ డివిజన్ ఆధీనంలోని వన్యప్రాణి ఆధారిత నెల్లూరు, రాపూరు రేంజ్‌లు మినహాయిస్తే.. మిగిలిన కావలి, ఆత్మకూరు, ఉదయగిరి రేంజ్‌ల పరిధిలో ప్రేక్షక పాత్రకే పరిమితమైన అటవీ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ వైఫల్యం.. మితిమీరుతున్న వేటగాళ్ల క్రూరత్వపు పంథాలతో కూడిన అస్త్ర, శస్త్రాల ప్రయోగ నేపథ్యాల్లో నిత్యకృత్యంగా మారిన అడవి జంతువుల మృత్యువాతలు అరణ్య రోధనను తలపిస్తున్నాయి. ఆహార అన్వేషణ, దాహార్తి తీర్చుకునే సమయాలను అదునుగా చేసుకొని అమాయక మూగజీవాలను మట్టుబెట్టేందుకు వేటగాళ్లు ప్రయోగించే నాటు తుపాకీ తూటాలు, ఉచ్చులు (రోప్‌లు), మందుపాతరలు (అవుట్లు), విద్యుత్ తీగల నుంచి బయటపడేందుకు సురక్షిత ప్రాంతాల అన్వేషణలో భాగంగా ఉరుకులు, పరుగులతో దిక్కుతోచని స్థితిలో జనవాసాల మధ్యకు వస్తున్న అడవి జంతువులు దుర్మరణం పాలవుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. జిల్లా అటవీ టెరిటోరియల్ డివిజన్ ఆధీనంలో ఉన్న నెల్లూరు, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు తదితర వన్యప్రాణి ఆధారిత రేంజ్‌ల పరిధిలో స్వేచ్ఛగా జీవించే వన్యప్రాణుల మనుగడకు అడుగడుగునా పొంచి ఉన్న ప్రమాదాలతో తీవ్ర విఘాతం ఎదురవుతుంది. అడవి వాతావరణానికి అలవాటు పడిన చిరుత, జింక, దుప్పి, అడవి పందితోపాటు సాధారణ రకాలకు చెందిన కుందేలు, ఉడుము, కొండముచ్చు, కొండగొర్రె తదితర రకాల జంతుజాతులు సైతం అనుక్షణం ప్రాణాలు గుప్పెట్లో ఉంచుకొని కాలం వెళ్లదీయాల్సిన దురదృష్టకర పరిస్థితులు నెలకొన్నాయి. అటవీ అధికారులు అనుసరిస్తున్న అలసత్వం వల్ల అల్ప సంపాదనకు అలవాటుపడిన వేటగాళ్లు సాగిస్తున్న మారణ హోమంలో

-మిగతా 2లో



# 3న మాజీ సీఎం జగన్ రాక

**కాకాణితో వైఎస్ జగన్ ములాకత్ - ఎమ్మెల్సీ పర్వతరెడ్డి, మాజీ మంత్రి అనిల్ వెల్లడి**

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లాకు విచ్చేస్తున్నారన్న సమాచారం వచ్చిన ప్రతిసారి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై పోలీసులు పిటి వారెంట్ జారీ చేసి మరో చోటుకి తరలించే ప్రయత్నం చేయడం సరికాదని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. జులై 3న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని మూలాఖత్ అయ్యేందుకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లా సెంట్రల్ జైలుకు వచ్చి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించనున్నట్లు తెలిపారు. ఆదివారం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం

-మిగతా 2లో

## నిరుపేద విద్యార్థులకు మాత్రమే
# వీఆర్ హైస్కూల్లో ప్రవేశాలు



- రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డితో కలిసి అభివృద్ధి పనులు పరిశీలించిన మంత్రి నారాయణ
- వీఆర్ హైస్కూల్లో ఆధునీకరించిన పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి నారాయణ

నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :

నేటి తన ఉన్నత స్థితికి కారణమైన విద్యాబుద్ధులు నేర్పిన వీఆర్‌సీ పాఠశాలను అభివృద్ధి చేయటం కనీస బాధ్యతగా భావించి ఆధునీకరించినట్లుగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు వీఆర్ హైస్కూల్లో చేస్తున్న అభివృద్ధి పనుల పురోగతిని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిలతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు. పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి

-మిగతా 2లో

### సీఎం చంద్రబాబు అపార అనుభవంతో..

# గాడిలో పడుతున్న ఆర్థిక వ్యవస్థ

- మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- ములుముడి బస్టాండ్ సెంటర్లో 15 లక్షలతో సిసి రోడ్డుకు శంకుస్థాపన
- ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని భరోసా



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ములుముడి బస్టాండ్ సెంటర్‌లో రూ.15 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు కు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. డివిజన్‌కు విచ్చేసిన మంత్రికి మహిళలు పూలవర్షం కురిపిస్తూ, బాణాసంచాలు, మంగళ వాయిద్యాలతో మంత్రికి స్థానికులు ఘనస్వాగతం పలికారు. తమ ప్రాంతానికి వచ్చిన మంత్రికి మార్వాడి మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. అభివృద్ధి ప్రదాతకు జేజేలంటూ నినాదాలు హోరెత్తించారు. అనంతరం వారందరితో కలిసి సిసి రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రోడ్డు శంకుస్థాపనకు వచ్చిన తనకు ఇక్కడి వారి చూపిస్తున్న అభిమానం ఎన్నటికీ మరువలేనన్నారు. నేడు శంకుస్థాపన చేసుకున్న ఈ రోడ్డును మరో నెల రోజుల్లో ప్రారంభోత్సవం చేస్తానని హామీ ఇచ్చారు. 2014లోనే మంత్రిగా 5250 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించానని గుర్తు చేశారు. 80 శాతం పనులు కూడా అయిపోయాయన్నారు. అయితే వాటిని గత ప్రభుత్వం తమపై అక్కసుతో ఆపేసిందని మండిపడ్డారు.



దాంతోపాటు ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని ఎద్దేవా చేశారు. ప్రజలు కట్టిన పన్నులను కూడా దారి మళ్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ చేతకాని పరిపాలనతో రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకొందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు అపార అనుభవంతో ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోందని మంత్రి భరోసా ఇచ్చారు. హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, డివిజన్ ఇంచార్జి ధర్మవరం గణేష్, 47వ డివిజన్ కార్పొరేటర్ రామక్రిష్ణ, టీడీపీ నేతలు, మహిళలు పాల్గొన్నారు.

# శారీరక ధృడత్వం క్రీడలతోనే సాధ్యం



**కావలి, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కావలిలోని బృందావనం కళ్యాణ మండపంలో ఆదివారం 'మిస్టర్ సింహపురి స్టీల్ మెన్ బాడీబిల్డింగ్ ఛాంపియన్ షిప్ 2025' రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, రాజ్య సభ సభ్యులు బీద మస్తాన్‌రావు, డీఎస్పీ శ్రీధర్, ఇండియన్ బాడీ బిల్డర్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ స్వామి రమేష్ కుమార్, ఆంధ్ర బాడీ బిల్డర్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ బాడీ బిల్డింగ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ వారు హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ఉమెన్ మోడల్ ఫిట్నెస్ ఏషియన్ గోల్డ్ మెడలిస్ట్ సంజన (ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్), అర్జున్ అవార్డు గ్రహీత నేషనల్ భాస్కరన్ పాల్గొన్నారు. రాష్ట్రవ్యా ప్తంగా సుమారు 150 మంది క్రీడాకారులు 10 విభాగాలలో పోటీ పడ్డారు. విజేతలకు ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి, ఎంపీ మస్తాన్‌రావులు బహుమతులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు క్రీడలపై మక్కువ పెంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కావలిలో తన మామ ఆశయాలను కొనసాగిస్తూ కావలి ఖ్యాతిని ఇండియా స్థాయిలో పేరు తీసుకు వచ్చేలా కృషి చేస్తున్న జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## అడవి జంతువుల అరణ్య రో(వే)దన

(మొదటి పేజీ తరువాయి)

సమిదలవుతున్న ఎన్నో అమాయక జంతుజాలాలు ప్రాణాలు కోల్పోతుండటంతో క్రమ క్రమేణ వన్యప్రాణి రకాలు హరించుకుపోతుండటంతో కేవలం మ్యూజియం (ప్రదర్శనశాల)ల్లో మాత్రమే దర్శనమిస్తున్నాయి. అటవీ వనరులు, వన్య జాతులను రక్షించాల్సిన అటవీ ఉద్యోగులే బాధ్యతలు విస్మరించి నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తుండటంతో తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్న అడవి జంవుతువులు వందల సంఖ్యలో మృత్యువాత పడుతుండటంతో క్రమ క్రమంగా అడవి జంతు జాతిరకాలు క్షీణించిపోయేందుకు కారణమవుతున్నట్లు తెలుస్తోంది. ఇదేతంతు కొనసాగితే భవిష్యత్ తరాలకు బొమ్మల పుస్తకాలు, ప్రదర్శన శాలల్లోనూ అడవి జంతువుల ఫొటోలు చూపిస్తూ అవగాహన కల్పించాల్సిన దయనీయ పరిస్థితులు ఎదురవుతాయనడంలో సందేహం లేదనిపిస్తోంది. వన్యప్రాణి వినాశనాన్ని అరికట్టడంతోపాటు వాటి సంతతిని వృద్ధి చేయడానికి భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1972 వన్యప్రాణి రక్షణ చట్టం సైతం కొందరు అటవీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యపు వైఫల్య నిర్వాకం వల్ల కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, నెల్లూరు తదితర రేంజ్‌లలో నీరుగారుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి వన్యప్రాణి సంరక్షణ భాగమైన 1972 వన్యప్రాణి రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతోపాటు కొందరు అటవీ అధికారుల్లో నెలకొన్న భాధ్యతా రాహిత్యంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

## 3న మాజీ సీఎం జగన్ రాక

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి అడ్డంకులు సృష్టించినా, జులై 3న జగన్మోహన్ రెడ్డి జిల్లాకు విచ్చేసి కాకాణి గోవర్ధన్ రెడ్డిని ములాకత్‌లో భాగంగా జిల్లా జైల్లో కలుస్తారని తెలిపారు. కూటమి ప్రభుత్వం కాకాణి గోవర్ధన్ రెడ్డి పట్ల వ్యవహరిస్తున్న తీరు బాగలేదన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత మాట్లాడుతూ.. తన తండ్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి మొదటి నుంచి వైఎస్ఆర్సిపి క్యాడర్ మొత్తం అండగా నిలబడడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జులై 3న వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లాకు విచ్చేసి తన తండ్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శిస్తుండడం తమకెంతో ధైర్యంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్న తీరు.. జిల్లాలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి చోటు చేసుకోలేదన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ కేసులు ఒకదాని తర్వాత మరొకటి నమోదు చేసి పోలీసులు అక్రమంగా గోవర్ధన్ రెడ్డిని నిర్బంధంలో తీసుకోవడం దుర్మార్గమన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి అక్రమ కేసులు విషయంలో జగన్మోహన్ రెడ్డి ఎప్పటికప్పుడు విషయాలు తెలుసుకుంటూ వారి కుటుంబానికి అండగా ఫోన్‌లో పరామర్శించడం జరుగుతుందన్నారు. అయితే గోవర్ధన్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను నేరుగా కలిసి పరామర్శించాలన్న ఉద్దేశంతో జగన్మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లాకు విచ్చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్సిపి నేతలపై పెడుతున్న అక్రమ కేసులను నిలిపివేయాలన్నారు. లేదంటే తెలుగుదేశం పార్టీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత చోటు చేసుకుని ఆ పార్టీపై ప్రజలే తిరుగుబాటు చేసే రోజు తప్పకుండా వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరుగ మురళి, జగన్మోహన్ రెడ్డి ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థులకు మాత్రమే వీఆర్ హైస్కూల్లో ప్రవేశాలు

(మొదటి పేజీ తరువాయి)

వినూత్నంగా ప్రవేశపెట్టిన పి4 పద్ధతిలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. చిన్నతనంలో తనకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రస్తుత స్థితికి కారణమైన వీఆర్‌సీ పాఠశాలను అభివృద్ధి చేయటం కనీస బాధ్యతగా భావించానని, ఇందుకు తన కుమార్తెలు ముందుకు వచ్చి వీఆర్‌సీ ఆధునీకరణలో భాగం పంచుకున్నారన్నారు. పేద, నిరుపేద విద్యార్థులకు ప్రాధాన్యతనిచ్చి వారికి అడ్మిషన్లు కల్పించడం జరిగిందన్నారు. అయితే అడ్మిషన్ల కోసం విపరీతమైన డిమాండ్ వచ్చిందన్నారు. దాంతో ఒకటి నుండి 9వ తరగతి వరకు రెండు సెక్షన్లకు బదులుగా మూడు సెక్షన్లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో అతి పేద విద్యార్థులను గుర్తించి ప్రవేశాలు కల్పించామన్నారు.



మిగిలిన పనులను త్వరితగ తిన పూర్తి చేసి అతి తొందరలో క్లాసులు ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం అందించే యూనిఫామ్‌కు అదనంగా నారాయణ విద్యాసంస్థల ద్వారా మరో నాలుగు జతలు యూనిఫామ్‌ను అందిస్తామని, అదేవిధంగా పాఠశాలకు దగ్గరగా ఉన్న విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందిస్తామన్నారు. దూర ప్రాంత విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం సైతం కల్పిస్తున్నామన్నారు. అలాగే నారాయణ విద్యాసంస్థల ద్వారా అవసరమైన ఫ్యాకల్టీ, బుక్స్ అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి4 విధానంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పారిశ్రామికవేత్త డీఎస్ ఆర్ గ్రూపు ఆధ్వర్యంలో రెండు పాఠశాలను ఆధునీకరిస్తామన్నారు.

### నెల్లూరు ప్రజలకు చిరకాలం గుర్తుండే నేత మంత్రి నారాయణ : అబ్దుల్ అజీజ్

పేదరికంలో పుట్టిన వారు పేదరికంలోనే మగ్గిపోకూడదనే ఉద్దేశంతో.. విద్య ద్వారానే ఉన్నత స్థితికి ఎదుగుతారని భావించి, కేవలం పేదల కోసమే వీఆర్సీ పాఠశాలను మంత్రి నారాయణ ఆధునికరించారని రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తలచిన ప్రతి కార్యక్రమాన్ని ఆచరణలో చేసి చూపించే నిరంతర శ్రామికుడు మంత్రి నారాయణ అని అన్నారు.

### పేదల పక్షపాతి మంత్రి నారాయణ : నుడా చైర్మన్

నిరుపేదల చదువు కోసం ఇంత పెద్దఎత్తున కోట్ల రూపాయల నిధులు వెచ్చించి వీఆర్‌సీ పాఠశాలకు పూర్వవైభవం తెస్తున్న నేత మంత్రి నారాయణ అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. కేవలం సంవత్సర కాలంలోనే మంత్రి నారాయణ చేసిన అభివృద్ధి పనులు అందరి కళ్ళ ముందు కనబడుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్, క్లస్టర్ ఇంచార్జ్, టీడీపీ నేతలు, కార్పొరేషన్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# వానపాములు ఎరువునేల పోషణకు అమూల్యనిధి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రైతులు రసాయనకఎరువులను విచక్షణా రహితంగా వాడడం వలన క్రమక్రమంగా మేలు చేసే సూక్ష్మజీవులు వానపాములు అంతరించిపోయాయి. సహజ వాతావరణంలో ఒకప్పుడు నేలలో విరివిగా కనిపించే వానపాములు నేడు కనుమరుగైపోయాయి వానపాములు ఉనికి కదలికల వల్ల నేల బాగా గుల్లగా మారుతుంది. ఫలితంగా భూమిలోకి గాలి నీరు చొరబడే శక్తి పెరుగుతుంది. వర్మీ కంపోస్టు తయారు చేయడానికి వివిధ రకాల వానపాములను ఉపయోగించవచ్చు భూమిపై పొరల్లో ఉండేవి. భూమి లోపలి పొరల్లో ఉండేవి రెండు రకాలుగా ఉంటాయి.

## వర్మి కంపోస్ట్.. తయారీ లాభాలు

వానపాములు సేంద్రియ పదార్థం ఎక్కువగా నేలను గుల్లగా చేస్తాయి వీటికి సేంద్రీయ పదార్థం 99 మట్టి ఆహారం సుమారు 70 శాతం మట్టిని 30శాతం సేంద్రియ పదార్థాన్ని ఆహారంగా తీసుకుంటాయి. సేంద్రీయ పదార్థంతో మిళితమైన మట్టిని ఆహారంగా తీసుకొని విసర్జన చేసిన పదార్థమే వర్మీ కంపోస్ట్ అంటారు. వానపాములు తీసుకున్న ఆహారం జీర్ణ వ్యవస్థలో అనేక రూపాంతరాలు చెంది అనేక రసాయనాలతో మిడతమైన పదార్థాన్ని విసర్జించడం వల్ల ఆ పదార్థంలో పోషకాలతో పాటు అనేక రకాల విటమిన్లు ఎంజైములు ఉండటం వల్ల వర్మీ కంపోస్ట్ విలువ చాలా ఎక్కువ.
**తయారీ విధానం :** ఒక మీటర్ వెడల్పు మూడు మీటర్లు పొడవు ఒక అడుగు ఎత్తు ఉండేలా మూడు సిమెంట్ తోటలో నిర్మించాలి. వీటిపై తాటి ఆకులు గానీ కొబ్బరి ఆకులతో గాని నీడ ఉండేటట్లు చేయాలి. ముందుగా ఆ రంగుల మందంలో కొబ్బరి పీచు అరటి ఆకులు గానీ చెరకు చెత్త గాని చిన్న చిన్న ముక్కలుగా చేసిపరచాలి దీనిని బెడ్ అంటారు. పశువులు తినగా మిగిలిన గడ్డి చెరకు చెత్త పాడైపోయిన కూరగాయలు పండ్లు వంటి వ్యర్థ పదార్థాలను సేకరించి పశువుల పేటతో కలిపి ఒకచోట ఉంచి పుల్లని ఇవ్వాలి. ఈ విధంగా కూలిన పదార్థంతో తొట్టెలు సగం వరకు నింపాలి. దీనిపై చదరపు మీటర్‌కు వెయ్యి చొప్పున వానపాములు వదిలిపెట్టాలి వీటిపై మరల కూలిన వ్యర్థ పదార్థాలను వేసి తొట్టెను పూర్తిగా నింపాలి. ఈ విధంగా చేసినప్పుడు మూడు తోటలకు 12,000 వానపాములు సరిపోతాయి. తేమ నిల్వ ఉండును తొట్టెలపై గోనే పట్టలు గాని వరి చేత్తగాని పరిచి వేసవి కాలంలో అయితే ప్రతిరోజు మిగిలిన కాలాల్లో మూడు రోజులకు ఒకసారి నీటిని చల్లుతూ 40శాతం తేమ ఉండేటట్లు చూసుకోవాలి. వర్మీ కంపోస్ట్ మొదటిసారి రెండు నెలల్లో తయారవుతుంది. పూర్తిగా తయారైన వర్మి కంపోస్ట్ పొడిగా నల్లగా తేలికగా టీ పొడి వలె ఉంటుంది.

## వర్మీ కంపోస్ట్ తయారీలో తీసుకోవలసిన జాగ్రత్తలు

వానపాములను సూర్యరశ్మి నుంచి వర్షం నుంచి రక్షణ కల్పించి, వర్మీ కంపోస్ట్ బెడ్ 30నుండి 40శాతం తేమ ఉండేటట్లు చూసుకోవాలి. పాక్షికంగా కుళ్ళిన వ్యర్థ పదార్థాల మిశ్రమాన్ని వాడడం శ్రేయస్కరం ఎలుకలు చీమలు, కోళ్లు మొదలైన వాటి నుండి వానపాములకు రక్షణ కల్పించి వ్యర్థాలను వేయడం వర్మీ ఎరువులుసేకరించడం సకాలంలో జరగాలి.

## వర్మీ కంపోస్ట్ వలన లాభాలు

వర్మీ కంపోస్ట్‌లో ఒకటి నుండి ఒకటి పాయింట్ ఐదు శాతం నత్రజని 0.8శాతం భాస్వరం 0.8శాతం పొటాష్ క్యాల్షియం మెగ్నీషియం రాగి ఇనుము జింక్ వంటి సూక్ష్మ పోషకాలు విటమిన్లు ఎంజైన్లు హార్మోన్లు ఉండటం వల్ల మొక్కల పెరుగుదల బాగా ఉండి దిగుబడులు పెరుగుతాయి. నీటిని నిలువ సామర్థ్యం పెరుగుతుంది నేల ఆమ్ల లేదా క్షార లక్షణాలను తొలగించవచ్చు మొక్కలకు చీడపీడలను తట్టుకునే శక్తి వస్తుంది కూరగాయలలో రుచి పూలలో సువాసన ఆహార పదార్థాల నిల్వ సామర్థ్యం పెరుగుతుంది పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చు.

## వర్మీ కంపోస్ట్ వాడే విధానం

వివిధ పంటలకు ఎకరాకు ఒకటన్ను వేయవచ్చు విత్తేముందు దుక్కిలో వేయాలి లభ్యతను బట్టి రెండు టన్నుల వరకు ఎకరానికి వాడుకోవచ్చు పండ్ల మొక్కలకు చెట్టుకు ఐదు నుండి పది కిలోల వరకు వేయవచ్చు పూలకుండీలలో 200 గ్రాములు వరకు వేసుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు.

# కండలేరు నిరుద్యోగులు అధైర్యపడాల్సిన అవసరం లేదు..




- కోర్టు ఉత్తర్వులు వెలువడిన వెంటనే ఖాళీ భర్తీ ప్రక్రియ
- తెలుగుగంగ సూపరిండెంటింగ్ ఇంజనీరు నర్ల రాధాకృష్ణారెడ్డి

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** తెలుగు గంగలో అంతర్భాగమైన కండలేరు జలాశయ నిర్మాణ సమయంలో ముంపుకు గురైన గ్రామీణ ప్రాంతాల బాధిత నిరుద్యోగులు అధైర్యపడాల్సిన అవసరం లేదని సూపరిండెంటింగ్ ఇంజనీరు నర్ల రాధాకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మేజర్ న్యూస్ మాట్లాడుతూ.. బాధిత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలతో ఉపాధి కల్పించేందుకు అవసరమైన ఖాళీలను గుర్తించే ప్రక్రియ జరుగుతుందని, ఈనెలాఖరు నాటికి పూర్తి వివరాలతో కూడిన నివేదికలు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 50 శాతం ఖాళీలను ముంపు బాధితులకు, మిగిలిన 50శాతం ఉద్యోగాలను డైరెక్ట్ రిక్రూట్మెంట్ విధానం ద్వారా భర్తీ చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే అవార్డ రులైన కండలేరు ముంపు బాధిత కుటుంబాలకు చెందిన నిరుద్యోగులకు సంబందించి మొదటి విడత కింద 168మందికి గానూ 138 మంది అవార్డదారులకు పోస్టింగ్లు ఇవ్వడం జరిగిందని, మరో 24కి ఇవ్వాల్సి ఉందన్నారు. అదేవిధంగా రెండవ విడతకు సంబందించి మొత్తం 106 దరఖాస్తులకు గానూ 20 ఖాళీలు భర్తీ చేయడం జరిగిందని, మరో 85 మంది ఇవ్వాల్సిఉండగా అసలు జాబితాలో పేరు లేని ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేయడంతో ముంపు బాధిత ఉద్యోగ నియామకాలు తాత్కాలికంగా ఆగినట్లు తెలిపారు. కోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలు అందేవరకు ఖాళీల భర్తీపై అధికారులు ముందడుగు వేయడం సాధ్యం కాదన్నారు. అయితే కోర్టు తీర్పు వచ్చేలోపు ఉన్నతాధికారుల దిశ. నిర్దేశిత మార్గదర్శకాలతో ఖాళీల వివరాల నివేదికలు సిద్ధం చేస్తున్నామని. కోర్టు నుంచి ఆదేశాలు అందిన వెంటనే సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకంగా ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

# రోడ్డుప్రమాదంలో సాగునీటిసంఘ చైర్మన్ మాదాల మృతి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు సాగునీటిసంఘ చైర్మన్, సీనియర్ తెలుగుదేశం నాయకుడు మాదాల మస్తాన్‌నాయుడు (67) ఒక రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లికి చెందిన మస్తాన్‌నాయుడు శుక్రవారం రాత్రి నెల్లూరు–ముంబాయి జాతీయరహదారిపై నెల్లూరుపాళెం సమీపంలోని తమ తూనికల కాటావద్దకు మోటర్‌సైకిల్‌పై వెళుతుండగా ఒక ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చికిత్సకై నెల్లూరులోని అపోలో వైద్యశాలకు తరలించగా కోలోకోలేక మృతిచెందాడు. ఆదివారం ఆయన మృతదేహాన్ని ఆత్మకూరుకు తరలించి స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో పోస్ట్‌మార్టం అనంతరం పేరారెడ్డిపల్లిలోని స్వగృహానికి తరలించారు. సోమవారం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మృతుడు మస్తాన్‌నాయుడుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతితో కన్నీటిపర్యంతం కాగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మస్తాన్‌నాయుడు తెలుగుదేశం ఆవిర్భావం నుండి తెలుగుదేశంలో కొనసాగుతున్నారు. గతంలో ఆయన ఆత్మకూరు సాగునీటిసంఘ వైస్‌చైర్మెన్‌గా ఉంటూ ఆరునెలలక్రితం జరిగిన ఎన్నికల్లో సాగునీటిసంఘం చైర్మెన్‌గా రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆశీస్సులతో ఏకగ్రీవంగా ఎన్నికై కొనసగుతున్నారు. ఎంతో సౌమ్యుడు, వివాదరహితుడు, సీనియర్ నాయకుడు మస్తాన్‌నాయుడు మృతికి గ్రామంలో యావత్తు బాధపడుతుండగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఆయన మృతికి ప్రగాఢసంతాపం



వ్యక్తం చేసి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

నాగేశ్వరమ్మకు..

# శత కవితా స్రష్ట బిరుదు పురస్కారం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజవర్గం పొంగూరుకు చెందిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ హిందీగా పని చేస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రచయిత, కవయిత్రి పార్లపల్లి నాగేశ్వరమ్మకు తెలంగాణ ప్రముఖ సాహిత్య సేవా సంస్థ కుసుమ ధర్మన్న కళాపీఠం వారు ఆమె సాహిత్య సమూహంలో అనతి కాలంలోనే 100 మేటి కవితలు రాసి పలుమార్లు విజేతగా నిలిచినందుకు పార్లపల్ల శత కవితా స్రష్ట బిరుదు ఈ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఇది సాహిత్యంలో తొలితరం దళిత కవులలో కుసుమ ధర్మన్న, ప్రముఖులు జయభేరీ పత్రిక సంపాదకుడు వ్యాసకర్త వక్త ఉద్యమకారుడు మాకు ఈ నల్ల దొరతనం అంటూ ఎన్నో రచనలు చేసిన గొప్ప కవి యొక్క మనుమరాలు డాక్టర్ రాధాకుసుమ  కుసుమ ధర్మన్న కళాపీఠం అనే పేరుతో ఒక గొప్ప సాహిత్య సేవా సంస్థను హైదరాబాదులో ఏర్పాటు చేసి ప్రతి నిత్యం రెండు తెలుగు రాష్ట్రాలలో వాట్సాప్ వేదికగా కవిత్వం పోటీలను నిర్వహిస్తున్నారు. ఏరోజుకారోజు ఫలితాలను వెల్లడిస్తూ వందల సంఖ్యలో కవులను ప్రోత్సహిస్తున్నారు. ఆదివారం కుసుమధర్మన్న కళా పీఠంలో తక్కువ సమయంలోనే వంద మేటి కవితలను రాసి పలుమార్లు విజేతగా నిలుస్తూ సాహిత్య రంగంలో తన ప్రతిభను చాటిచూపుతున్న శ్రీమతి పార్లపల్లి నాగేశ్వరమ్మకు ఈ ప్రశంసా పత్రాన్ని డాక్టర్ రాధా కుసుమ అభినందిస్తూ ప్రధానం చేశారు. ఈ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో గతంలో కూడా హైదరాబాదు త్యాగరాజ గానసభ రవీంద్రభారతిలో జరిగిన కవి సమ్మేళనాలలో గతంలో పార్లపల్లి నాగేశ్వరమ్మ పాల్గొనడం అభినందనీయం. ఈ సందర్భంగా నాగేశ్వరమ్మ కుసుమ ధర్మన్న వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ రాధా కుసుమకు హృదయపూర్వక కృతజ్ఞతలు సంతోషాన్ని వెలిబుచ్చారు. అవార్డ్ అందుకున్న నాగేశ్వరమ్మను ఏపి కాట్వా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు, నాయకులు పార్లపల్లి హాజరత్తయ్య, పార్లపల్లి నాగరాజారావు, పార్లపల్లి సుధాకర్‌రావు, కోలా శ్రీహరిరావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య తదితరులు అభినందించారు.

# ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి కాకర్ల ధ్యేయం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధి కాకర్ల ధ్యేయమని ఉదయగిరి దుర్గం కొండపై తెలుగుదేశం పార్టీ జెండాను రెపరెపలాడించిన ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఏడాది పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ టీఎన్‌టీయుసీ అధ్యక్షులు బొజ్జ శ్రీనివాసులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ తరఫున టికెట్ తెచ్చుకొని మొదటి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా గెలిచిన కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి కొరకు పట్టు వదలని విక్రమార్కుడు లాగా అభివృద్ధి వైపు ప్రయాణం సాగిస్తూ ముందుకు దూసుకెళ్తున్నారు అన్నారు. అసెంబ్లీ సమావేశాలలో ఉదయగిరి నియోజకవర్గం గురించి లోటుపాట్ల గురించి గలమెత్తి తన బాణీని ఖచ్చితత్వంతో ఉదయగిరి ప్రజల తరఫున ఎన్నిసార్లు మాట్లాడిన ఒకే ఒక ఎమ్మెల్యేగా చరిత్రలోకి ఎక్కాడని అన్నారు. నియోజకవర్గ మొత్తం సుడిగాలి పర్యటన చేస్తూ ప్రతి సమస్య గురించి తానే క్షుణ్ణంగా తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు చేపడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రాబోయే రోజుల్లో ఉదయగిరిని అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిత్యం ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో గుర్తింపు పొందారున్నారు. కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తన సమస్యలకు భావించి పరిస్కారం చూపుతున్నారు. మండలం నుండి సీతారాంపురం మండలం వరకు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలలో తెలుగుదేశం పార్టీ కొరకు కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గౌరవిస్తూ రాబోయే రోజుల్లో పార్టీ పట్టిష్టతకు తనదైన రాజకీయ చాణిక్యతను ప్రదర్శించి నాయకులను తయారు చేస్తున్నాడని కొనియాడారు. ఏడాది కాలం పూర్తి చేసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాలనలో ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు సంతృప్తితో ఉన్నారన్నారు.



రాబోయే కాలంలో కూడా ఇదేవిధంగా ఆయన పాలన కొనసాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఆయనకు మంత్రి పదవి కచ్చితంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఈ ఏడాది అంగరంగ వైభవంగా రొట్టెల పండుగ సంబరాలు

## నెల్లూరు బారా షాహిద్ దర్గాలో రొట్టెల పండగ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష మంత్రి పొంగూరు నారాయణ





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన 415 సంవత్సరాల చరిత్ర కలిగిన నెల్లూరు బారా షాహిద్ దర్గాలో ఈ ఏడాది అంగరంగ వైభవంగా రొట్టెల పండుగ నిర్వహించనున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నెల్లూరు బారాషాహిద్ దర్గాలో రొట్టెల పండుగ ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో ఆదివారం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా దర్గాకు విచ్చేసిన మంత్రి నారాయణ.. రూరల్ ఎమ్మెల్యే సోదరుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, దర్గా కమిటీ, టీడీపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జులై ఆరు నుంచి ఆరు రోజుల పాటు జరగనున్న రొట్టెల పండగ ఏర్పాట్లపై శాఖల వారీగా మంత్రి సమీక్ష నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక ధ్రుష్టి పెట్టాలని మంత్రి నారాయణ ఆదేశించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ మేరకు ఈ నెల 30 తేదీలోపు ఏర్పాట్లు అన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. నెల్లూరు బారాషహీద్ దర్గాకు 415 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఇక్కడ మతసామరస్యానికి ప్రతీకగా రొట్టెల పండుగ జరుపుకొంటారని తెలియజేశారు. బారా షాహిద్ దర్గా స్వర్ణాల చెరువులో రొట్టెలు పట్టుకొంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాడ విశ్వాసం అన్నారు. అందుకే ప్రతీ ఏడాదీ దర్గాకు భక్తుల రద్దీ పెరుగుతుందని తెలిపారు. గతంలో పారిశుధ్య సమస్య వల్ల భక్తులు ఇబ్బంది పడేవాళ్లని గుర్తు చేశారు. 2014లో సమూలమైన మార్పులు తెచ్చామన్నారు. స్వర్ణాల చెరువులో ఘాట్ ఏర్పాటు చేసి నీరు కలుషితం కాకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహణ సరిగా జరగలేదని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది రొట్టెల పండుగను అంగరంగ వైభవంగా జరిపిస్తామని మంత్రి మాటిచ్చారు. శానిటేషన్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. 2014లో నారాయణ మంత్రిగా ఉన్నప్పుడు రొట్టెల పండగని రాష్ట్ర పండగగా ప్రకటించారని గుర్తు చేశారు. మతసామరస్యానికి ప్రతీకగా రొట్టెల పండుగ జరుగుతోందన్నారు. ప్రతీ ఏడాది భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని తెలియజేశారు. టీడీపీ హయాంలో రొట్టెల మార్పిడికి ఘాట్, టాయిలెట్స్ ఏర్పాటు చేసామన్నారు. మంత్రి ఆధ్వర్యంలో శానిటేషన్ కి పెద్దపీట వేశారని తెలిపారు. మంత్రి చొరవతో 9 కోట్లతో జీ ప్లస్ వన్ మస్జీద్ వచ్చే పండుగలోపు నిర్మిస్తామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, డీఎస్పీ సింధు ప్రియ, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, వివిధశాఖల విభాగాధిపతులు, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న కావ్య, బిఎమ్మార్

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి రాజ్యసభ సభ్యులు ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి, కావలి వాసి షేక్ ఖాదర్ భాషా కుటుంబ సభ్యులను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డితో కలిసి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు పరామర్శించారు. ముందుగా ఖాదర్ బాషా చిత్రపటానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం కావలి పట్టణంలో వివిధ పత్రికల్లో విలేకరిగా 40 సంవత్సరాల నుండి పనిచేస్తున్న వార్త సీనియర్ జర్నలిస్ట్, ఆర్యవైశ్య నాయకులు ఓలేటి నాగేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డితో



కలిసి నాగేశ్వరావు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాగేశ్వరావు కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు ఏకగ్రీవం ?



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండల టీడీపీ సంస్థాగత ఎన్నికలు ఆదివారం నరుకూరులోని రిషి కళ్యాణ మండపంలో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు దారా పెంచలరావు నరసింహులు ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షునిగా కొణతం రఘు బాబు, ప్రధాన కార్యదర్శిగా మన్నెం జితేంద్ర గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికల నియమావళి ప్రకారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పరిశీలకులు మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 175 నియోజకవర్గాలలో సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఐదు మండలాలలో ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. పదవులు పొందిన నాయకులు బాధ్యతాయుతంగా పనిచేస్తూ అందరినీ కలుపుకొని పోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం ఎన్నికైన వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర తోటపల్లి గూడూరు సహకార బ్యాంక్ అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి పేదూరు సొసైటీ అధ్యక్షులు గూడూరు నారాయణ విజయ డైరీ డైరెక్టర్ కోడూరు శ్రీనివాసుల రెడ్డి (చినబాబి రెడ్డి) చావా కోటయ్య నాయుడు సోమిరెడ్డి రేవంత్ రెడ్డి చింతా సీతారామయ్య సుమన్ చేవూరు శ్రీనివాసులు గోపిరెడ్డి వెంకటేశ్వర్లు ఏఎంసి డైరెక్టర్ సుస్మిత గంగపట్నం సుధీర్ వెంకటసుబ్బయ్య ఇతర మండల స్థాయి నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మాదాలకు నివాళర్పించిన టీడీపీ నాయకులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సీనియర్ నాయకుడు, ఆత్మకూరు సాగునీటిసంఘ చైర్మెన్ మాదాల మస్తాన్ నాయుడు మృతదేహానికి ఆదివారం పలువురు తెలుగుదేశం నాయకులు నివాళులర్పించారు. పేరారెడ్డిపల్లిలోని మస్తాన్ నాయుడు స్వగృహంలో ఆయన మృతదేహానికి తెలుగుదేశం నాయకులు సోమశిల ప్రాజెక్టుకమిటీ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి, తాళ్ళూరు గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఆత్మకూరు మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుంకర పెంచల చౌదరి, సీనియర్ టిడిపి నాయకుడు కేతా విజయభాస్కరరెడ్డి, జిల్లా తెలుగుయువత నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులునాయుడు, టిడిపి నాయకులు షేక్ ఖాజావలి, డక్కామల్లికార్జున తదితరులు ఘననివాళులర్పించారు. మృతదేహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మాదాల బంధువర్గీయులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి మంగమ్మను పరామర్శించిన కౌన్సిలర్లు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుమహిళ నాయకురాలు చంద్రపాటి మంగమ్మను ఆదివారం మున్సిపల్ కౌన్సిలర్లు పరామర్శించారు. మంగమ్మ భర్త పెంచలయ్య ఇటీవల మృతి



చెందడంతో వారు ఆమె ఇంటికెళ్ళి పరామర్శించి ఓదార్చారు. పెంచలయ్య మృతికి సంతాపం తెలిపిన నాయకులు మంగమ్మకు, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కరరెడ్డి, పొడమేకల పెంచలయ్యయాదవ్, దగ్గుమాటి శివకోటారెడ్డి, టిడిపి నాయకుడు ఒంటేరు మల్లికార్జున పాల్గొన్నారు.

# హెల్తీ.. వెల్తీ.. హ్యాపీ స్వర్ణాంధ్రప్రదేశ్

- లక్ష్యసాధనలో భాగస్వాములు కావాలి
- విద్యుత్ రెవెన్యూ బకాయి వసూళ్లు వేగవంతం చేయండి
- అదనపు విద్యుత్ లోడును గుర్తిస్తే జరిమానా విధింపు
- ఉమ్మడి జిల్లా పర్యవేక్షక ఇంజనీరు విజయన్



**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** హెల్తీ.. వెల్తీ.. హ్యాపీ స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యసాధనలో భాగమైన సోలార్ విద్యుత్ వ్యవస్థ వైపు ప్రతి ఒక్కడూ అడుగులు వేయాలన్న ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్ష మేరకు విజన్-2047లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని నెల్లూరు జిల్లా పర్యవేక్షక ఇంజనీరు విజయన్ పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరు జిల్లాల్లోని ఇంజనీరింగ్, అకౌంట్, టెక్నికల్, రెవెన్యూ విభాగాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ నెల్లూరు సర్కిల్ పరిధిలోని పెండింగ్ రెవెన్యూ బకాయి వసూళ్లు వేగవంతం చేస్తేనే సంస్థ పురోగభివృద్ధి దిశగా మనుగడ సాధ్యమవుతుందని. రాష్ట్రం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో ఆక్వారైతులకు అందిస్తున్న కరెంట్ సరఫరా తాలూకు పెండింగ్ బకాయిలు వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముస్తీ యోజన పథకం చేకూరే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలను మరింత ఎక్కువగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లాల్లో వర్షాలు కురుస్తున్న ప్రస్తుత నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భవన నిర్మాణ కార్మికులు. గృహవి నియోగ దారులు జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా వ్యవసాయ రైతులు, కూలీలు పంపుసెట్ను కరెంట్ తీగల వద్ద అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ తీగల సమీపంలో స్విచ్ బోర్డులు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆచీ తూచి పనులు చేయా లని, ముందస్తు జాగ్రత్త చర్యగా కరెంట్ సరఫరాను నిలిపివె సిన తర్వాతనే పనులు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ఉచిత విద్యుత్ సరఫరా తాలూకు నెలసరి రూ.30 బకాయిలు గత 6 మాసాలుగా రూ.180 చొప్పున పెండింగ్‌లో ఉండటంతో సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని, సంస్థ మనుగడను దృష్టిలో ఉంచుకొని వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే గృహ వినియోగదారుల సౌకర్యార్థం అడిషనల్ (అదనపు) లోడ్ క్రమబద్ధీకరించుకునె ందుకు 50శాతం రాయితీ సదుపాయం కల్పించడం జరిగిందని, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 30వరకు కొనసాగుతుందన్నారు. ఏపీఎస్పీడిసిఎల్ వెబ్‌సైట్‌లో గానీ.. ఆయా ప్రాంతంలో ఉన్న విద్యుత్ ఉపకేంద్రంలోగానీ అధికారులను సంప్రదించి దరఖాస్తులు చేసుకోచ్చని సూచించారు. ఒక కిలోవాట్‌కు డెవలప్మెంట్ చార్జీల కింద రూ.2వేలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ.. సూర్య ఘర్ పథకం కింద 50శాతం రాయితీతో రూ.1000 చెల్లిస్తే సరిపోతుందని, సెక్యూరిటీ డిపాజిట్ కిలోవాట్‌కు రూ.200లలో మార్పు ఉండదని, తప్పనిసరిగా చెల్లించాల్సిందేనన్నారు. గత కొనె ద్నేళ్ల క్రితం విద్యుత్ కనెక్షన్ తీసుకున్న వారి వినియోగం అప్పటితో పోల్చి చూస్తే 3 నుంచి 4రెట్లు పెరిగి ఉంటుందని, ఫలితంగా అదనపు సమస్య ఎదురవుతుందన్నారు. తనిఖీల సమయంలో అదనపు లోడ్ వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యఘర్ నోడల్ ఆఫీసర్ బాలచంద్ర, ఎస్ఏవో మురళి, జిల్లాల్లోని ఇంజనీరింగ్, అకౌంట్, రెవెన్యూ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి : సామజికవేత్త మాలకొండారెడ్డి



**బోగోలు, మేజర్‌న్యూస్ :** సమాజంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన పెంచుకుని రక్షణ పొందాలని లోక్‌సత్తా ఉద్యమ నమస్త రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి కోరారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కొరకు చట్టాలు వచ్చి మూడు దశాబ్దాలు దాటినా అధికారుల అలసత్వం వలన ఇప్పటికీ వినియోగదారులు మోసపోతున్నారని ఆవేదన చెందారు. నేడు ఎక్కడ చుసిన తుకాలలో తేడాలు, కలితిల జోరు, ధరలలో వ్యత్యాసం వలన వినియోగదారులు నిలువునా మోసపోతున్నారని తెలిపారు. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, వినియోదరునికి నాణ్యమైన వస్తువులు అందుతాయని, అలాగే అధికారులలో అవినీతి తగ్గుతుందని తెలిపారు. ముఖ్యంగా వినియోగదారులు హక్కులతోపాటు భాద్యతలు కూడా తెలుసుకుని అన్యాయాలను అవినీతిని ప్రశ్నించినప్పుడే వినియోగదారుల రక్షణ చట్టం ప్రయోజనాలు ప్రజలకు అందుతాయని తెలిపారు. ప్రతి వినియోగదారుడు వస్తువులను కొనేటప్పుడు రసీదులను తీసుకోవాలని కోరినారు. నష్టపోయిన వినియోడాగారుడు, వినియోదరుల ఫోరమ్‌లో ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందాలని కోరారు. స్వచ్ఛంద సేవాసంస్థలు, ప్రజాపతినిధులుమరియు అధికారులు కలిసి వినియోగదారులను చైతన్య పరిచి వినియోగదారుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు జరగడానికి నిరంతరం కృషి చేయాలనీ మాలకొండారెడ్డి కోరారు.

## 24న కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్ రెడ్డి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈనెల 24వ తేదీ అనగా మంగళ వారం ఉదయం 9.30గంటలకు నెల్లూరు ఇందిరా భవన్‌లో నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరుగునని, అందరూ పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చేవూరు దేవకుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి, ఇతర రాష్ట్ర స్థాయి నేతలు హాజరవుతారు. నియోజకవర్గ సమన్వయకర్తలు, రాష్ట్ర, జిల్లా స్థాయి వివిధ కమిటీల్లో ఉన్న నాయకులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, విద్యార్థి, యువత, మహిళ, రైతు, కార్మిక, సేవాదళ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ డిపార్ట్మెంట్ చైర్మన్‌లు పార్టీ ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయ వలసిందిగా కోరుతున్నామన్నారు.

## అభివృద్ధి పథంలో బీజేపీ

- పొదలకూరులో కరపత్రాలు ఆవిష్కరణ
- 11 సంవత్సరాలు సుదీర్ఘంగా విజయపదంలో బీజేపీ





**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** బీజేపీ పార్టీ భారతదేశపు అమృతకాలం సేవ సుపరిపాలన పేదల సంక్షేమానికి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా పొదలకూరు మండల బీజేపీ అధ్యక్షుడు పూల ప్రశాంత్, ఉపాధ్యక్షుడు చొప్ప వెంకటేశ్వర్లు కరపత్రాలు ఆవిష్కరించారు. బీజేపీ సీనియర్ నాయకుడు చింత గింజల సుబ్రహ్మణ్యం, మాట్లాడుతూ.. 11 సంవత్సరాలు పరిపాలనలో బీజేపీ పార్టీ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన నరేంద్ర మోడీ ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా 81 కోట్లకు పైగా, రాష్ట్రంలో 2.68 కోట్లకు పైగా, ఉచిత బియ్యం అందిస్తున్నాము. అదేవిధంగా ప్రధానమంత్రి కిసాన్ యోచన పథకం ద్వారా రైతులకు 6000 వార్షిక సహాయం దేశంలో మొత్తం 3.7లక్షల కోట్లు రాష్ట్రంలో 17వేల కోట్ల పంపిణీ చేశారు. దేశభద్రత అంటేనే నరేంద్రమోడీ దేశరక్షణ కోసం ఆపరేషన్ సింధూర్ ద్వారా తొమ్మిది ఉగ్రవాద స్థావరంలో ధ్వంసం చేయబడినవి మన సైనికశక్తికి ఇది నిదర్శనం. మనదేశమే మన జాతీయభద్రతే మన నరేంద్రమోడీకి ముఖ్యం. మండలంలో మా బిజెపి పార్టీ తరఫున 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మేము చేసిన అభివృద్ధిని ఈ కరపత్రం ద్వారా ప్రతి ఒక్కరికి తెలియచేయాలని ప్రతి ఇంటికి ప్రతి మనిషికి అందజేయాలని ఈ కరపత్రాలు పంపిణీ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రాచపుటీ ధనుంజయరావు, బీజేపీ టౌన్ అధ్యక్షులు ఓబులేష్, కార్యదర్శి జనార్దన్ రెడ్డి, సీనియర్ నాయకులు పిచ్చయ్య, బీజేపీ మండల చేనేత సెల్ అధ్యక్షులు పైడాకుల పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో నేర నియంత్రణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఆట కట్టించుటకు ఆయా గ్రామాలలోని గ్రామస్తులు, గ్రామ పెద్దలతో, యువతతో అవగాహన కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ జీ.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సిహెచ్ సౌజన్య సూచనలతో, జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజలతో భాగస్వామ్యులు అయ్యేలా కార్యచరణ రూపకల్పన చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా ఆయా పరిధిలోని పోలీసులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలోని సమస్యలు, ఆస్తి నేరాలు, నివారణ చర్యలు, సైబర్ మోసాల గురించి, గాంజా, ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి, మహిళలు మరియు బాల బాలికలపై జరిగే నేరాలు, ఇతర చట్టాలు, శిక్షలు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలియజేశారు. గ్రామాలలో తగాదాలు, గొడవలు పడరాదని, అందరూ కలిసిమెలిసి సామరస్యంగా జీవించాలని వారికి తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ఆయా పరిధిలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకంగా నిఘా ఉంచి, చెడు నడత, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వారిపై పోలీసు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అదేవిధంగా ఎవరికైనా



అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే డయల్ 112 లేదా ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కి తెలపాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

# విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన మేయర్




**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు నగర మేయర్ స్రవంతిజయవర్ధన్ సహాయ సహకారాలతో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి టీ 20 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించగా కావలి మండలం, గూడూరు మండలం మధ్య హెూరా హెూరీగా చివరి వరకు ఉత్కంఠంగా సాగిన పోరులో చివరకు గూడూరు ఘన విజయం సాధించింది. వీజేతలకు రూ.30 వేలు మొదటి బహుమతి, రూ.15వేలు రెండవ బహుమతి, రూ.7,500 మూడవ బహుమతి ముఖ్యఅతిథులు అందజేశారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు నగర మేయర్ స్రవంతిజయవర్ధన్, జెడ్‌పి తీసి సభ్యులు చేవూరి అరుణ, ఏపి జాయింట్ డైరెక్టర్ యాకసిరి వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈ తలపల రమేష్, పోట్లూరి శ్రీనివాసులు, పులి చెంచయ్య, బిఎల్ శేఖర్, ఈగ రామయ్యా, గుంధళ్ళ శ్రీరాములురా, సుజాతమ్మ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ స్రవంతిజయవర్ధన్ మాట్లాడుతూ.. గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. గిరిజన క్రీడాకారులలో పోటీ తత్వాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో గిరిపుత్ర ఫౌండేషన్ వారి టోర్నమెంట్ ఏర్పాటు చేయడం చాలా మంచి కార్యం అని తెలియజేశారు. ఇలాంటి మంచి కార్యక్రమాలతో గిరిపుత్ర ఫౌండేషన్ వారు ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# మాదాల మృతి అత్యంత బాధాకరం

### మృతదేహానికి నివాళులర్పించిన మంత్రి ఆనం ఆనం రామనారాయణరెడ్డి





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సీనియర్ తెలుగుదేశం నాయకుడు, ఆత్మకూరు చెరువు సాగునీటిసంఘ చైర్మెన్ మాదాల మస్తాన్‌నాయుడు మృతి అత్యంత బాధాకరమని, తెలుగుదేశంకు తీరనిలోటు అని రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. రోడ్డుప్రమాదంలో మస్తాన్‌నాయుడు మృతిచెందగా పేరారెడ్డిపల్లిలోని ఆయన స్వగృహంలో మంత్రి మస్తాన్‌నాయుడు మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రమాద వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మస్తాన్‌నాయుడు కుమారుడు, బంధువులతో ఆయన మాట్లాడి వారిని ఓదార్చారు. వారికి సానుభూతి తెలిపారు. ఈసందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ మస్తాన్‌నాయుడు సీనియర్ తెలుగుదేశం నాయకుడని, సాగునీటిసంఘ చైర్మెన్‌గా ఎన్నికయ్యాక చెరువు అభివృద్ధికి అనేక ఆలోచనలు చేశారని, అకస్మాత్తుగా ఆయన దుర్మరణం పాలవడం ఎంతో బాధాకరమని అనం పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు సోమశిల ప్రాజెక్టుకమిటీ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి, తాళ్ళూరు గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఆత్మకూరు మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, సీనియర్ టిడిపి నాయకుడు కేతా విజయభాస్కరరెడ్డి, జిల్లా తెలుగుయువత నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులునాయుడు, టిడిపి నాయకులు షేక్ ఖాజావలి, దక్కామల్లికార్జున, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మాదాల బంధువర్గీయులు తదితరులు పాల్గొన్నారు.

### మంత్రిగా నారాయణ సాధించిన

# ప్రగతి పుస్తకం ఆవిష్కరించిన వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రిగా డాక్టర్ పొంగూరు నారాయణ ఏడాది కాలంలో నెల్లూరు నగర నియోజకవర్గంలో సాధించిన ప్రగతి పుస్తకాన్ని (ఈనాడు దినపత్రిక ప్రచురించిన ప్రత్యేక సంచిక) వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం నగరంలోని 54 డివిజన్ కార్పొరేటర్ సఫియా బేగం, ముజీర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నగర నియోజకవర్గ పరిధిలో సంవత్సర కాలంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈనాడు దినపత్రిక ప్రత్యేక సంచికను రూపొందించి ప్రజలకు అందించడం జరిగిందన్నారు.నగరంలోని టీ దుకాణాలు, ఫ్యాన్సీ షాపులు, ఇంటింటికి పంపిణీ చేయడం జరిగిందన్నారు. మంత్రి నారాయణ నేతృత్వంలో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు చేరువ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కొండ బిట్రగుంట సమీప ద్వారకా నగర్ శ్రీ షిరిడి శేష సాయి బాబా మందిరంలో 29 సంవత్సరాలు గురుపౌర్ణమి వేడుకలను విగ్రహ ప్రతిష్ట నిర్వహించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రజతోత్సవాలు జులై 8, 9, 10 తేదీలలో అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాటు చేయనున్నారు. శేష సాయి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కుటుబోయిన బ్రహ్మానందం మాట్లాడుతూ.. విగ్రహ ప్రతిష్ట నిర్వహించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే గురు పౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించడం జరిగిందని తెలిపారు. మూడవరోజు జులై 10 వ తారీకు గురువారం విశేషంగా మహా అన్నదాన కార్యక్రమం. ఆధ్యాత్మిక మహాసభ మధ్యాహ్నం మూడు గంటలకు రాష్ట్రస్థాయి ఎద్దులచే బండలాగు బల ప్రదర్శన ,సాంస్కృతిక భజన, కోలాట కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుచున్నవి కనుక మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలలో వేలాదిమంది పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని ఈ సందర్భంగా కోరడం జరిగింది. ఆఖరి రోజు కావలి శాసనసభ్యులు దగ్గుబాటి వెంకటకృష్ణారెడ్డి రాష్ట్రస్థాయి ఎద్దులచే బండలాగు బల ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి వారితోపాటు అనేకమంది రాజకీయ ప్రముఖులు భక్తులు ఆధ్యాత్మిక పెద్దలు పాల్గొంటారని తెలిపారు.

### సేవా దృక్పథంతో పనిచేసే వారే..

# సర్పంచులుగా గెలవాలి

▸ సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం మండలంలోని ఈదగాలి గ్రామంలో ఆదివారం టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఆయన సతీమణి శృతి రెడ్డి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం బాధ్యత గల నాయకులే సర్పంచులుగా ఎన్నిక కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు నమ్మకంతో ఓట్లు వేసిన తరువాత కొందరు వైసీపీ సర్పంచులు సమస్యలను పట్టించుకోకపోవడాన్ని ఆయన దురదృష్టకరంగా వ్యాఖ్యానించారు. గ్రామాల్లో ముఖ్యంగా సైడ్ కాలువలు వంటి అంశాలపై తాము స్పందన అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో విశ్వాసం కలిగించాయని, ఇటీవల అమలైన తల్లికి వందనం పథకం ద్వారా 95శాతం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ అయ్యాయని చెప్పారు. మిగిలిన 5శాతం కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు,



చవటపాలెం సొసైటీ చైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు, కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్ల నాగార్జున రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కుంకాల నాగేంద్రప్రసాద్, గ్రామ టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సద్వినియోగం కాని పాఠశాల వంటగదులు, మరుగుదొడ్లు నాడు..



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో గ్నతంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మించిన వంటగ్నాదులు. మరుగుదొడ్లు, కొళాయిలు, ఈ-టాయిలెట్లు ఏమాత్రం సద్వినియోగ్నం కాలేదు. మరి గ్నత ప్రభుత్వం నాడునేడులో నిర్మించే వంటగ్నాదులు, మరుగుదొడ్లునైనా వినియోగ్నంలో ఉంచుతారా అనేది చూడాల్సి ఉంది. ఆత్మకూరు ఎంతంలో అనేక భవనాలు లక్షల వ్యయంతో నిర్మించడం వాటిని వినియోగ్నంలోకి తేకుండా వదిలేయడం, కొన్ని అవసరమైన వాటికి భవనాలు పనులు ప్రారంభించి అర్ధ ంతరంగా నిలిచిపోవడం పరిపాటిగా ఉంది. మరి నాడు-నేడు అంటూ నిర్మించే భవనాలు, వంటగ్నదులు, టాయిలెట్లు అయినా వినియోగ్నంలోకి తెస్తారా అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాధమిక, ప్రాధమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నిర్మించిన మరుగుదొడ్లు, వంటగ్నదులు, కొళాయిలు ఏమాత్రం వినియోగ్నంలో లేక ఎండా కన్పిస్తుండేవి. తాళాలు వేయబడి, శిధిలమై కన్పిస్తుండేవి. కొన్నిచోట్ల అరాకొరా నిర్మాణాలతో దర్శనమిస్తుండేవి. కొళాయిల కోసం నిర్మించిన దిమ్మెలు దిష్టిబొమ్మల్లా గా కన్పిస్తుండేవి. ఈనాటికీ వాటి పరిస్థితి అదేమాదిరిగా ఉంది. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అమలులో ఉన్న విషయం విధితమే. తొలుత ప్రాధమిక ప్రాధమికోన్నత పాఠశాలల్లో మాత్రమే మధ్యాహ్నభోజనం అమలుకాగా అక్కడంతా వంటగ్నదులు నిర్మించారు. కొంతకాలానికి ఉన్నత పాఠశాలల్లో కూడా మధ్యాహ్నభో జనం అమలులోకి రాగా చాలాకాలం

## వినియోగంలోకి రావాలని నేడు..

తరువాత అక్కడ వంటగ్నదులు నిర్మించారు. ఆత్మకూరు పట్టణంలోని ఈస్ట్, వందూరుగ్మంట, ఉర్దుబాలుర, ఏసిఎస్‌ఆర్కాలనీ, జ్యో తినగ్నర్, టెక్యా, మండలంలోని అశ్వనీపురం ఉర్దు, కొత్తపాళెం, గొల్లపల్లి, నెల్లూరుపాళెం మెయిన్, రావులకొల్లు, టి. ముస్తాపురం, వెంకట్రావుపల్లి ఎసిటి, వెన్నవాడ ఎస్సి పాఠశాలలకు తొలుత వంగ్నిటదులు లేకపోగా అనంతరం మంజూరయ్యాయని చెబుతుండేవారు. కరటంపాడు, సాతానుపల్లి, మహిమలూరు, కనుపూరుపల్లి, రామస్వామి పల్లి, ఆరవేడు, తదితర గ్రామాల్లో వంటగ్నదులు మంజూరై పనులు ప్రారంభించినా పూర్తిచేయకుండా ఏళ్ళతరబడి దర్శనమిస్తున్నాయి. పాఠశాలల్లో నిర్మించిన వంటగ్నాద ఎలు, మరుగుదొడ్లు నిరుపయోగ్నంగా ఉంటుండే విషయం అందరికీ తెల్సిందే. మధ్యాహ్నభోజనం అమలులో ఉంటే తాగ్నినీటి కొళాయిలు కూడా నిరుపయోగ్నంగా ఉం డడంతో అందరూ ఇళ్ళ నుండి తాగ్నినీరు తెచ్చుకుంటూ ఇబ్బందిపడుతుండేవారు. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన వంటగ్నాదులు, మరుగుదొడ్లు నిరుపయో గ్నంగా ఉండగా నాలుగేళ్ళ క్రితం ఇ-టాయిలెట్లున్ను నిర్మించారు. వాటిని కూడా



వినియోగించకుండానే నిరుపయోగ్నిమయ్యాయి. కాగా గ్నిత ప్రభుత్వం నాడునేడు కార్యక్ర మంలో భాగంగా పలు పాఠశాలల్లో అధికవ్యయంతో మౌళికవసతులు కల్పిస్తుండగా అందులో మరుగుదొడ్లు, వంటగ్నిదులు కూడా ఉన్నాయి. మరి వాటినైనా వినియో గ్నంలోకి తెస్తారా అనేది సందేహమే అయినా చూడాల్సి ఉంది.






# వీర్లగుడిపాడును ఆత్మకూరు మండలంకు మార్చాలన్నది కంఠశోషేనా

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వరదలు సంభవించినా, భారీవర్షాలు కురిసినా, సోమశిల జలాశయం నుండి అధికనీటిని పెన్నానదికి విడుదల చేసినా ఆందోళనకు గురయ్యే గ్రామం, అందరికీ గుర్తుకు వచ్చే గ్రామం ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగ్నం మండలం వీర్లగుడిపాడు. ఈగ్రామం సమీపంలోని ఆత్మకూరు మండలంల లోకి మార్చాలన్న ఆగ్రామస్థుల కోరిక కంఠశోషగానే మిగిలింది. కేవలం ఐదారువందల జనాభా, 400మంది ఓటర్లు కలిగిన చిన్నగ్రామమై అయినా ఇరువైపులా పెన్నా, బగ్గేరు నదులు ఉండడంతో పుష్కలంగా సాగ్నినీటి వసతి కలిగి పైర్లతో పచ్చదనం కళకళలాడుతూ కన్పిస్తుంటుంది. గతంలో వరి, కొబ్బరి, సపోటా, తమలపాకులు తదితర పంటలు అధికంగా ఉండేవి. కొంతకాలం క్రితం రొయ్యలు, చేపల గుంటలు కూడా అధికంగా తీసి కొనసాగించారు. క్రమీణా వాటిని కూడా తొలగించి వరిపైరు సాగుచేస్తున్నారు. తమలపాకు తోటలు పూర్తిగా లేకుండా పోయాయి. కొబ్బరిచెట్లు మాత్రం అధికంగా ఉన్నాయి. కాగా ఈగ్రామానికి సంబంధించి పలు సమస్యలు అనాదిగ - ఉన్నా నాయకులు హామీలివ్వడమే తప్ప వాటిని గురించి పట్టించుకున్న దాఖలాలు లేనేలేవు. వీర్లగుడిపాడు ఆత్మకూరుకు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉండగా మధ్యలో బొగ్గేరు ఉంది. రాకపోకలు సాగించే అవకాశం లేదు. అదీగాక ఈ గ్రామం సంగ్నం మండలంలో ఉంది. ఏ పనిబడినా మండల కేంద్రానికి వెళ్ళాలంటే ఆత్మకూరు మీదుగా 33కిలో మీటర్లు ప్రయాణించాల్సి ఉంది. ఆత్మకూరు మండలంలో తమ గ్రామాన్ని చేర్చాలని, బొగ్గేరుపై వంతెన నిర్మిస్తే కేవలం ఐదు కిలోమీటర్లలో ఆత్మకూరు ఉన్నందున, తమ అవసరాలన్నింటికి ఆత్మకూరే అయినందున ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని గ్రామస్థులు అనాదిగా చెబుతుండగా ఎన్నికల సమయంలో మాత్రం నాయకులు అలకించడం, అనంతరం మరిచిపోవడం సాగ్నితోంది. పెన్నా, బొగ్గేరు నదుల మధ్య ఈ గ్రామం ఉండడంతో భారీ వర్షాలు కురిసినా, పైతట్టు ప్రాంతాల్లో వ ర్షాలు అధికమై సోమశిల జలాశయానికి నిండుగా చేరాక నీటిని పెన్నానదికి లక్షలాది క్యూసెక్కులు విడుదల చేస్తే నదీపరీవాహకంలో లోతట్టుగా ఉన్న వీర్లగుడిపాడు జలదిగ్నంధంకు గురికావడం, గ్రామంలోకి ఐదారు అడు గుల నీరు ప్రవేశించడం జరుగుతుంది. గ్రామంలో ఒకే ఒక కమ్యునిటిహాల్ ఉండగా అందరూ అక్కడే తలదాచు కొని కాలం1్నడుపుతుంటారు. అధికా రులు ఈవలవైపు చేరి ఆహారపదార్థాలు పడవలద్వారా చేరవేస్తుంటారు. అయితే ఇంతటి ఆందోళనకరమైన పరిస్థితిలో ఈ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలంటే సారవంతమైన నేలలు, పుష్కలమైన సాగునీరు, ఏడాది పొడవునా పంటలు అంటూ గ్రామస్థులు తిరస్కరిస్తుంటారు. చిన్న గ్రామమైన పాడిపంటలతో గ్రామస్థులకు లాభసాటిమాత్రమే కాకుండా రవాణాదారులకు, వాహనాలకు, విద్యుత్చార్జీలు రూపేణా అధికంగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. కూలీ లకు నిత్యం ఉపాధి ఉంటుంది.

# టీడీపీ మరింత బలోపేతమే లక్ష్యంగా సంస్థాగత కమిటీల ఏర్పాటు : మంత్రి ఆనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం మరింత బలోపేతం లక్ష్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణం చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. చేజర్ల మండలం పెరుమళ్ళపాడు వ్యవసాయ క్షేత్రంలో ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, పార్టీ పరిశీలకులు, నాయకులతో ఆదివారం ప్రత్యేకంగామంత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశానికి పార్టీ పరిశీలకులు బుల్లెట్ రమణ, ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల,మున్సిపాలిటీ ల టీడీపీ పరిశీలకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ లక్ష్యాలు, బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై టీడీపీ శ్రేణులకు మంత్రి ఆనం దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అన్ని విభాగాలు, అనుబంధ సంఘాలకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్ర పార్టీ నిర్ణయాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కమిటీల ఏర్పాటు అని మంత్రి తెలిపారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో కష్టపడి పని చేసిన వారికి కమిటీల్లో ప్రాధాన్యత ఉంటుందని,ఇప్పటికే నియోజకవర్గంలోని ఆత్మకూరు టౌన్‌తోపాటు ఆరు మండలాలకు మండల స్థాయి కమిటీలను ఎంపిక చేసామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించి 7448 మంది కుటుంబ సాధికారక సారథులను నియమించామని, నియోజకవర్గంలోని 278 బూత్‌లకు బూత్ కన్వీనర్లను, కో కన్వీనర్లను నూరుశాతం నియమించామన్నారు. 52 యూనిట్లకు 11 క్లస్టర్లకు కన్వీనర్లు, కో కన్వీనర్లను భర్తీ చేసామని,గ్రామ స్థాయి ప్రధాన కమిటీలకు సమర్థులైన వారిని ఎంపిక చేశామన్నారు. జులై 7లోగా ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో ఇంకా మిగిలి ఉన్న పలు అనుబంధ సంఘాలకు గ్రామస్థాయి నుంచి టిడిపి సంస్థాగత కమిటీల ఎంపికను మండల స్థాయి కమిటీలు పూర్తి చేయాల్సి ఉందని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయి కమిటీలనుంచి మంచి నాయకత్వ పటిమ గల వారిని ఎంపిక చేసి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి కమిటీల్లో చోటు కల్పిస్తామని, కమిటీల్లో స్థానం పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ కోసం అంకితభావం, నిజాయితీతో పనిచేయాలని, పార్టీ సాధించిన విజయాలను, రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను, పార్టీ నిర్ణయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ప్రతి ఇంటి వద్దకే సంక్షేమాన్ని



తీసుకెళ్తున్నామని, పింఛన్లను ఇచ్చిన మాట ప్రకారం పెంచి అందిస్తున్నామని,అన్నా క్యాంటీన్లు ప్రారంభించామని, మూడు దీపం గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇస్తున్నామని, రికార్డు స్థాయిలో తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి తల్లుల ఖాతాలకు నగదు జమ చేసామన్నారు. త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ, మండల తెలుగుదేశం కమిటీ ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నార్త్ కోచింగ్ సెంటర్ల మోసపూరిత ప్రకటనలు నమ్మద్దు




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నార్త్ నుంచి వచ్చిన కొన్ని మోసపూరిత విద్యాసంస్థలు తమకు జాతీయ స్థాయిలో ర్యాంకులు వచ్చాయని, నెల్లూరు నారాయణ కళాశాలలో చదివిన విద్యార్థులు సాధించిన ర్యాంకులు తమవని చెప్పుకొని చేస్తున్న మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక హరినాధపురంలోని నారాయణ కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ 2025లో నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించడం జరిగిందన్నారు. తమ విద్యార్థులు సాధించిన జాతీయ స్థాయి ర్యాంకులను తమవిగా చెప్పుకుంటూ ఓ విద్యాసంస్థ మోసపూరిత ప్రకటనలు చేస్తుందని వాటిని విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మొద్దని ఆయన పేర్కొన్నారు. నారాయణ మెడికల్ అకాడమీకి చెందిన విద్యార్థులు నీటి 2025 పరీక్ష ఫలితాల్లో 1000 లోపు 9 ర్యాంకులు కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. ఓపెన్ క్యాటగిరీలో 161, 253, 323, 515, 546, 563, 804, 955, 962 ర్యాంకులు నారాయణ విద్యాసంస్థలకే దక్కాయి అన్నారు. అలాగే వివిధ కేటగిరీల్లో వందలోపు 13, 17, 38 వంటి మూడు ర్యాంకులు సాధించి జాతీయస్థాయిలో మరోసారి నారాయణ విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారన్నారు. ఇటీవల విడుదలైన నీట్ 2025 ఫలితాలలో తమ విద్యార్థుల ర్యాంకులను దక్షిణాది నుంచి వచ్చిన ఓ విద్యా సంస్థ తమ విద్యార్థులను ప్రలోభ పెట్టి వారు సాధించినట్టుగా ప్రకటించుకున్నారన్నారు. ఇటువంటి మోసపూరిత ప్రకటనలను విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మొద్దని, నారాయణ విద్యాసంస్థలు అన్ని పోటీ పరీక్షలలో అగ్రస్థానంలో నిలవడం తట్టుకోలేని ఆయా విద్యా సంస్థల యాజమాన్యం ఇటువంటి మోసపూరిత కుట్రలు చేయడం దౌర్భాగ్యం అన్నారు. అటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు అలా అటువంటి ప్రలోభాలకు గురి కావద్దని విజ్ఞప్తి చేశారు. అనంతరం ర్యాంకులు విద్యార్థులు మాట్లాడుతూ.. ఓ విద్యా సంస్థ తమను ప్రలోభ పెట్టి తమతో మోసపూరిత ప్రకటనలు చేయించారని వివరించారు. తాము నారాయణ విద్యా సంస్థలలో స్కూలు స్థాయి నుండి చదువుకుంటున్నామని నారాయణ విద్యాసంస్థల అధ్యాపకుల పర్యవేక్షణ వల్లే తాము ఇంతటి ఘన విజయం సాధించగలిగామని చెప్పారు. ఈ సమావేశంలో డీన్, కోడ్ డీన్‌లు, ఏజీఎంలు, ప్రిన్సిపాల్‌లు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టీడీపీ నూతన కార్యవర్గానికి సత్కారాలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నీలం మల్లికార్జున్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి నూతనంగా ఎన్నిక కావడంతో ఆదివారం రాత్రి రెండు గ్రామాల్లో ఆత్మీయ సన్మాన కార్యక్రమాలు ఘనంగా జరిగినాయి. మండలంలోని మామిడిపూడి, సివిఆర్ మధుర నగర్ గ్రామంలో ఈ కార్యక్రమాలు పార్టీ నాయకత్వం నిర్వహించింది. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు సంయుక్త ఆధ్వర్యంలో సన్మానం చేశారు. సాలువాలుకప్పి పూలమాలలువేసి కేకు కటింగ్ చేయించారు. ఈ రెండు గ్రామాల్లో ఘనంగా స్వాగతం పలికి అభిమానం చూపారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కార్యకర్తలు నాయకులు సహకారంతో నియామకం అయినట్లు పేర్కొన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక కేంద్రంగా తాటిపర్తి

- గ్రామంలో 14 దేవాలయాలు
- ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామం.. అదే ఇప్పుడు ఆద్యాత్మికం





**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** అదోచిన్న గ్రామం. సుమారు 1500 ఇళ్లు 7500 మందికి పైగా జనాభా నివసిస్తుంటారు. ఈ గ్రామంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా 14 దేవాలయాలు వెలిశాయి. దేవాలయాలకు అందరూ వెళుతుంటారు. నిత్యం ఏదోఒక దేవాలయంలో పూజలు, భజనలు జరుగుతుంటాయి. ఏటా అన్నీ దేవాలయాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఒకప్పుడు ఫ్యాక్షన్ గోడవలతో ఆ గ్రామం అట్టుడికిపోయేది. అదే గ్రామం ఇప్పుడు దైవ చింతనతో విరాజిల్లుతోంది. మండలంలోని తాటిపర్తిలో పాండురంగస్వామి, ఆంజనేయ స్వామి, రామాలయం, శివాలయం మరో రెండు విఘ్నేశ్వరుడి ఆలయాలతోపాటు గ్రామదేవతలైన పోలేరమ్మ, ఎల్లమ్మ, లేదోటమ్మ, సవడమ్మ, మాతమ్మ, చెంచులక్ష్మి తదితర దేవాలయాలు ఉన్నాయి. పురాణ పఠనానికి ఇస్కాన్ సిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామీణ ఆశ్రమాన్ని నిర్మించారు. గ్రామంలో రాజకీయ పార్టీలు, వర్గాలు ఉన్నప్పటికీ దేవాలయాలకు అందరూ కలసి కట్టుగా రావడం విశేషం.

ఆలయాలకు ఉత్సవాలు చేసేటప్పుడు సమైక్యంగా ఉంటారు. ఏటా భారీగా తిరునాళ్ళు నిర్వహిస్తారు. గ్రామంలో ఉన్నవారితోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడినవారు కూడా వచ్చి ఉభయకర్తలుగా వ్యవహరిస్తుంటారు.





సూర్య



విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, అనంతసాగరం, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9000483583

## ఆధ్యాత్మికంగా పాల పొంగళ్ళు వేడుకలు



**దుత్తలూరు/వింజమూరు, మేజర్‌న్యూస్ :** దత్తలూరు మండలంలోని నర్రవాడలో వెలసిన శ్రీ రవ్వధూళి అంకాలమ్మ తల్లి పాల పొంగళ్ళు ఆదివారం ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. గ్రామ శాంతి, సౌభాగ్యాల కోసమూ, వర్షాభావ నివారణకై నిర్వహించే ఈ ఉత్సవం గ్రామ ప్రజలలో భక్తి భావాన్ని మరింతగా రేకెత్తిస్తోంది. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. పుష్పాలు, పటాకులు, శోభాయమాన దీపాలతో ఆలయ పరిసరాలు ప్రకాశిస్తూ, పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. మహిళల ఆకృతిగా అమర్చిన పాల పొంగళ్ళు ఈ ఉత్సవానికి విశిష్టతను కలిగించాయి. మేకపాటి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పూజా కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారి దర్శనం పొందుతున్నారు. వేద మంత్రోచ్చారణలతో, ఘంటా నాదాలతో ఆలయం మారుమోగుతోంది. ఈ కార్యక్రమం గ్రామీయులందరికి మానసిక ఆనందాన్ని, ఆధ్యాత్మిక ఉద్వేగాన్ని అందిస్తోంది.

## కరుణించి కాపాడమ్మా మానసా దేవి



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని తూర్పురొంపిదొడ్లలో వెలసిన శ్రీ మానసాదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. చివరిరోజు ఆదివారం ఉదయం నుండి వాల్మీకిపూజ, సహస్రనామార్చన, కుంకుమ పూజ, పొంగళ్ళు, మహా నివేదన వంటి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలు చల్లా వంశస్థుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. నాలుగు, ఐదు రాష్ట్రాలలో ఉండేటువంటి చల్లా వంశస్థులు అందరూ అక్కడికి చేరుకొని బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కరుణించి కాపాడమ్మా అంటూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం గ్రామంలోని ప్రతి ఒక్కరూ అమ్మవారికి పొంగళ్ళు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారిని భారీ గజమాలలు పూలతో సుందరంగా అలంకరించి బాజాభజంత్రీలు బాణసంచా పేలుళ్ల మధ్య గ్రామంలోని పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారి దర్శన భాగ్యం పొందారు. ఈ కార్యక్రమంలో చల్లా వంశస్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఆలయాన్ని పలు రకాల విద్యుత్ దీపాలతోనూ పలు రకాల పుష్పాలతోనూ ప్రత్యేకంగా అలంకరించారు.